క్లుప్తంగా

రెవెన్యూ సదస్సులు సమర్థంగా నిర్వహించాలి



తాళ్లరేవు తహసీల్దార్ త్రినాథరావుకు సూచనలిస్తున్న ఎస్‌డీసీ భారతి

తాళ్లరేవు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా నిర్వహించాలని ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ) డి.భారతి ఆదేశించారు. సోమవారం ఆమె తాళ్లరేవులో పర్యటించి తహసీల్దార్ పితాని త్రినాథరావుకు పలు సూచనలు చేశారు. రెవెన్యూ సదస్సుల్లో రైతుల సమస్యలకు సంబంధించి పూర్తి స్థాయిలో పరిష్కారం చూపించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు ఎం.సుబ్బారావు, సూరిబాబు తదితరులు ఉన్నారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

తాళ్లరేవు: ఈ నెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నట్లు తాళ్లరేవు భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ ఉదయం 6 గంటలకు ధనస్సు పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మాసంలో ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవ, 5 గంటలకు పూజా సంకల్పం, విష్ణు సహస్ర నామ పూజ, గోదాదేవికి కుంకుమార్చన తదితర పూజలు జరుగుతాయన్నారు. ధనుర్మాసం నెల రోజులు తులసి, కుంకుమ పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జనవరి 4వ తేదీన లక్ష తులసి పూజ, 6న దీపోత్సవం, అమ్మవారికి సారె, 9న కర్పూర హారతులు, 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, అదే రోజు సాయంత్రం స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తామన్నారు. 12వ తేదీన కుడార్తై, 13న గోదా కల్యాణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సీఐ వీరబాబుకు సత్కారం



సీఐ వీరబాబును సత్కరిస్తున్న పలు ప్రజా సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ సీఐగా, అమలాపురం రూరల్ ఇన్‌చార్జి సీఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పి.వీరబాబు శాంతి భద్రతల పరిరక్షణకు నిత్యం శ్రమిస్తున్నారని పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. వివిధ ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులు స్థానిక పట్టణ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ వీరబాబును సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీ దుర్గారావు, పీఈఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, బీఎస్పీ జిల్లా నాయకుడు పొలమూరి మోహన్, న్యాయవాది యాలంగి సత్యనారాయణ తదితరులు సీఐ వీరబాబును సత్కరించి అభినందించారు.

సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

అమలాపురం టౌన్: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను అమలాపురం నియోజకవర్గ పార్టీ నాయకులు స్థానిక ముమ్మిడివరం గేటు సెంటరులో సోమవారం ఘనంగా నిర్వహించారు. నియోజకర్గ పార్టీ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సోనియాగాంధీ జన్మదిన కేక్ కట్ చేసి వేడుక జరుపుకున్నారు. సోనియా పదేళ్లు యూపీఏ చైర్ పర్సన్‌గా ఉన్నప్పుడు చేపట్టిన పథకాల గురించి నాయకులు మాట్లాడి ఆమె సేవలను కొనియాడారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఎండీ షకీలా పాల్గొన్నారు.

ఆబోతుకు అంత్యక్రియలు



ఆబోతు మృత దేహాన్ని జేసీబీతో తరలిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ 13వ వార్డు మహిపాల చెరువు సమీపంలో 216 జాతీయ రహదారిపై ఆబోతును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అది అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఆ వార్డుకు చెందిన శీలం పండు చొరవతో జేసీబీ సహాయంతో మున్సిపాలిటీ ట్రాక్టర్‌లో ఆబోతును శ్మశాన వాటికకు తరలించారు. అంత్యక్రియలు నిర్వహించారు. స్థానికంగా చోటు చేసుకున్న ఈ ఘటన మానవత్వానికి మచ్చుతునకగా నిలిచింది.

నిరుపయోగ నిర్మాణమేల..?

- అవసరం లేని చోట రహదారి నిర్మాణం
- అధికారులు ఉదాసీనతతో నిధుల దుర్వినియోగం
- దశాబ్దాల కాలంగా రోడ్ల కోసం ఎదురుచూస్తున్న ఎస్సీ కాలనీలు
- పల్లె పండుగ పనులతో కూటమి నేతలకే ప్రయోజనం



గుండెపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అవసరం లేకున్నా నిర్మిస్తున్న రహదారి



జాంబవానిపేటలో బురదమయంగా మారిన మట్టిరోడ్డు

అల్లవరం: ప్రజా ప్రయోజనాలను కాపాడవలసిన అధికారులు ప్రజాధనాన్ని పనికి రాని పనులకు వినియోగించి నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు పక్షపాతంగా వ్యవహరించినా అధికారులు మాత్రం సమానత్వ భావంతో అందరికీ ఉపయోగపడే విధంగా పనులు గుర్తించి వాటిని చేపట్టాలి. మరి అలా కాకుండా అధికారులే ప్రజా ప్రతినిధులకు వత్తాసు పలుకుతూ ఇష్టారాజ్యంగా పనులు చేపడితే ప్రజలు ఎవరికి చెప్పుకోవాలి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లె పండుగ పేరిట గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి పీఆర్ డిపార్టుమెంట్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ద్వారా పనులు గుర్తించడం, పంచాయతీల ద్వారా తీర్మానాలు, వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగింది. ఇప్పటికే పల్లె పండుగ పనులు చాలా గ్రామాల్లో పూర్తి చేయడం జరిగింది. పూర్తి చేసిన పనుల్లో సగానికి పైగా పనులు కూటమి నేతల సొంతానికి ఉపయోగపడే రీతిలో చేపట్టడం గమనార్హం. వారి ఇళ్లకు, పొలాలకు వెళ్లే రహదారుల్లో సీసీ రోడ్లు నిర్మించారు.

ఒక్క ఇంటికీ ఉపయోగం లేదు

దేవగుప్తంలో పల్లె పండుగ పనుల్లో భాగంగా గుండెపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మంచిగంటి తాతారావు ఇంటి వరకు రూ.12 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఒత్తిడితో అప్పటి పంచాయతీ కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ నుంచి పంచాయతీ తీర్మానం చేసి ఇచ్చారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఏ ఒక్కరికీ ప్రయోజనం లేదు. ఒక్క ఇల్లు కుడా లేదు. కేవలం చుట్టూ పక్కల వారికి బహిర్భూమి కోసం మాత్రమే ఈ రోడ్డుని వినియోగిస్తున్నారు. మరి అలాంటిది ఈ రోడ్డు కోసం రూ.12 లక్షల నిధులు ఎందుకు దుర్వినియోగం చేయాల్సి వస్తుందో అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. ఈ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆనందరావు స్వయంగా వచ్చి శంకుస్థాపన చేశారు. ఆయనకు కూడా తెలియకుండానే నిధులు కేటాయించారా.. అనేది టీడీపీలో మరో వర్గం ప్రశ్నిస్తోంది. దీనిపై స్థానికంగా కొందరు టీడీపీ నేతలు ఎమ్మెల్యే ఆనందరావును కలసి ఈ రోడ్డు పనులు ఆపేసి ప్రజలకు అవసరం ఉన్న చోట రోడ్లు వేయాలని కోరడం జరిగింది. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించమే కాకుండా మెయిన్‌రోడ్డును ఆనుకుని రోడ్డు నిర్మాణానికి మరోసారి శంకుస్థాపన చేశారు.

మండలంలో 21 పంచాయతీల పరిధిలో 24 పనులకు గానూ రూ.2.22 కోట్ల నిధులు కేటాయించారు. ఇదే గ్రామంలో జాంబవానిపేట, ఇందిరమ్మ కాలనీల్లో ఎస్సీలకు కేటాయించిన ఇళ్ల స్థలాల మధ్య రోడ్డు నిర్మాణం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఇందిరానగర్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. మెయిన్‌రోడ్డు, రామాలయం వీధుల్లో రోడ్ల నిర్మాణం కోసం ఎప్పటి నుంచో బీసీలు ఎదురు చూస్తున్నారు. ప్రజలకు ఇన్ని అవసరాలు ఉంటే ఇవేమీ పీఆర్ అధికారులకు కనిపించలేదా అని ప్రశ్నిస్తున్నారు. అవసరం లేకున్నా రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజల అవసరాలను నిర్లక్ష్యం చేస్తున్న అధికార యంత్రాంగంపై గ్రామస్తులు భగ్గుమంటున్నారు.

విన్నవించినా ఫలితం లేదు



"గుండెపూడి రోడ్డు నుంచి మంచిగంటి తాతారావు ఇంటి వరకు నిర్మిస్తున్న రోడ్డు ఏ ఒక్కరికీ ఉపయోగం లేదు. ఎస్సీ గ్రామాల్లో చాలా చోట్ల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఈ నిధులను అక్కడికి వెచ్చించాలని ఎమ్మెల్యేని కోరడం జరిగింది. ఆయన కూడా మా విజ్ఞప్తిని అంగీకరించారు. మెయిన్‌రోడ్డు అనుకుని రహదారి నిర్మాణానికి మరోసారి శంకుస్థాపన చేశారు. ఇప్పుడేమో అధికారులు గుండెపూడి రోడ్డు నుంచి తాతారావు ఇంటి వరకు రోడ్డు నిర్మాణానికి పనులు చేపట్టారు. ఎస్సీ గ్రామాలను నిర్లక్ష్యం చేస్తే ఊరుకోం."

ముత్తాబత్తుల రాంబాబు, టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు, దేవగుప్తం.

నడక నానీల కవితా సంపుటి ఆవిష్కరణ



నడక కవి నల్లా రచించిన నడక నానీల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సత్యనారాయణరెడ్డి, వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురంలో నడకపై ప్రజలకు చైతన్యం కల్పిస్తూ నడక కవిగా పేరుగాంచిన నల్లా నరసింహమూర్తి ప్రజారోగ్యం కోసం తన కలంతో పోరాటం చేస్తున్నారని అంతర్జాతీయ వాకర్స్ చీఫ్ కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణ రెడ్డి అన్నారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు, కవి నల్లా నరసింహమూర్తి రచించిన 'నడక నా తల్లి-నడత నా తండ్రి' నడక నానీల కవితా పుస్తకాన్ని సత్యనారాయణరెడ్డి స్థానిక డాబా గార్డెన్స్‌లో సోమవారం ఆవిష్కరించి ప్రసంగించారు. 2001వ సంవత్సరం నుంచి తాను నడక చైతన్యంతో రాసిన పుస్తకాలను ప్రజలకు ఉచితంగా అందిస్తూ వారిలో నడక స్ఫూర్తిని నింపుతున్న నరసింహమూర్తి సేవలు అభినందనీయమని మరో అతిథిగా హాజరైన నడిపూడి వాకర్స్ లాఫింగ్ ఆరోగ్య సేవా సంస్థ అధ్యక్షుడు, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ అన్నారు. కేవలం నడకపై 111 కవితా సంపుటిలు రచించిన కవి నల్లాకు ఇటీవల జాతీయ స్థాయి అవార్డు లభించడం ఆయన నడక కోసం చేస్తున్న కృషికి తార్కాణమని గుర్తు చేశారు. వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు సాపే బాల రవి, కడలి సత్యనారాయణ, పెనుమాల చిట్టిబాబు, గెడ్డం భాస్కరరావు, కాశి వెంకట్రావు, దేవరపల్లి మోహనరావు తదితరులు తమ ప్రసంగాల్లో నడక కవి నల్లా నడక సేవలను కొనియాడారు. ఈ నెల 28, 29 తేదీల్లో ఏలూరులో జరగనున్న అంతర్జాతీయ వాకర్స్ కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని వాకర్స్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రి

ముమ్మిడివరం: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ ఎస్‌జీఆర్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి కోరారు. ముమ్మిడివరం విశాంత్ర ఉద్యోగుల సమావేశ మందిరంలో సోమవారం యూనిట్ అధ్యక్షులు రెడ్డి వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2018 నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. 11వ పీఆర్సీలో గ్రాట్యుటీని 12 లక్షల నుంచి 16 లక్షలకు పెంచాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రిలో విశ్రాంత ఉద్యోగులకు వైద్య సేవలందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ప్రభుత్వం స్పందించి నవంబరు నెల నుంచి సీపీఎస్‌ని నిలుపుదల చేయడం పట్ల సమావేశం హర్షం వెలిబుచ్చింది. ఈ సమావేశంలో యూనిట్ కార్యదర్శి పెద్దిరెడ్డి రామకృష్ణారావు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు జొన్నల గడ్డ గోపాలకృష్ణ, పీవీవీ సత్యనారాయణరాజు, ఎం.ఆశీర్వాదం, జనిపెల్ల సత్యనారాయణ, పేరి కామేశ్వరి, పల్లపు త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు తిలోదకాలు

ప్రారంభం కాకుండానే ఓహెచ్ఆర్ ట్యాంకు లీకేజీ



ఓహెచ్ఆర్ ట్యాంకు అడుగు భాగం నుంచి కారుతున్న నీరు

అల్లవరం: తూర్పులంక ఎస్సీ కాలనీలో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఓహెచ్ఆర్ ట్యాంకు నుంచి తాగునీరు లీకేజీ అవుతోంది. సీఎస్ఆర్ నిధులు రూ.24 లక్షలతో చేపట్టిన ఓహెచ్ఆర్ ట్యాంక్ ఇటీవలే నిర్మాణం పూర్తి చేసుకుంది. ట్యాంక్ నుంచి పైపులైన్‌కు అనుసంధానం పనులు ఇంకా చేయాల్సి ఉంది. ట్యాంకు ట్రయల్ రన్ కోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆదివారం నీరు నింపారు. ట్యాంకులో నీరు పంపింగ్ చేసిన తర్వాత నిర్మాణంలో నాణ్యతా లోపాలు బయట పడ్డాయి. ట్యాంకు అడుగు భాగం నుంచి రెండు చోట్ల ధారాళంగా నీరు కారుతోంది. ఇదే కాకుండా ట్యాంక్ పై భాగంలో ట్యాంక్ చుట్టూ లీకేజీలు ఉన్నాయి. ఓహెచ్ఆర్ ట్యాంక్ ఇంకా ప్రారంభమే కాకుండా ఒక్క చుక్క నీరు కూడా సరఫరా కాకుండా అప్పుడే లీకేజీ కావడంతో ట్యాంకు నాణ్యతా ప్రమాణాలపై ఆందోళన నెలకొంది. ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించారా లేదా అన్న అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది. గ్రామానికో ఇంజినీరింగ్ అధికారి విధులు నిర్వర్తిస్తున్నా నాణ్యతపై ఎందుకు నిర్లక్ష్యం వహించారని కాలనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రొయ్యల చెరువుల నిర్వాహకులపై ఫిర్యాదు

తాళ్లరేవు: మండల పరిధిలోని పోలేకుర్రు శివారు తూర్పుపేట గ్రామంలో పలువురు రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారని, దీనివల్ల నీరు కలుషితం అవుతోందని వాటిని తక్షణమే ఆపాలని గ్రామస్తులు తహసీల్దార్ పితాని త్రినాథరావుకు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ రహదారి చెంతన గల వాటర్ ట్యాంకు సమీపంలో ఉన్న చెరువులను ఉప్పునీటి చెరువులుగా మార్చేసి రొయ్యల సాగు చేపడుతున్నారని, దీనివల్ల తమ ఇళ్లలోని బోరింగులు, నూతుల్లో నీరు ఉప్పగా మారిపోతున్నాయని, చెరువులకు ఉపయోగించే కెమికల్స్ వల్ల నీరు కలుషితమై ఇబ్బందులు కలుగుతున్నందున వాటిని ఆపాలని గ్రామస్తులు వాసంశెట్టి లక్ష్మి, డి.ప్రశాంతి, వి.సత్తిబాబు, నాగమణి తదితరులు కోరారు.

స్థలాల ఆక్రమణలపై విచారణ చేయాలి

నీలపల్లి, కోరంగి పంచాయతీ దిండి గ్రామాల్లో పలువురు ఇళ్ల స్థలాలను ఆక్రమించుకున్నారని వాటిపై విచారణ చేసి తమకు న్యాయం చేయలని పలువురు కోరారు. నీలపల్లి ఇందిరమ్మ కాలనీలో స్థలాలను పలువురు ఆక్రమించి గృహ నిర్మాణాలు చేస్తున్నారని, పలువురు ప్రభుత్వ స్థలాలను విక్రయిస్తున్నారని వీటిపై విచారణ చేయాలని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కోరంగి పంచాయతీ దిండి గ్రామంలో సర్వే నెంబరు 290లో తనకు గల రెండు సెంట్ల స్థలాన్ని కొందరు ఆక్రమించి వేధిస్తున్నారని తనకు న్యాయం చేయాలని బాధితుడు పి.సత్యనారాయణ కోరారు. నీలపల్లి పంచాయతీలో అక్రమంగా లే అవుట్‌లు వేసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించకుండా కొందరు అవినీతికి పాల్పడుతున్నారని స్థానిక నాయకుడు రెడ్డి ఈశ్వరరావు ఫిర్యాదు చేశారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేద్దాం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన కొరకు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ ఆర్ మునిస్వామి పేర్కొన్నారు. సోమవారం స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తికి ప్రధానంగా అవగాహన లేమి, పేదరికం, వైద్య సదుపాయాల కొరత, చదవు లేకపోవడం వంటి పరిస్థితులు కారణమవుతున్నాయని అన్నారు. ఈ కారణంగా ఎయిడ్స్ నిర్మూలనపై విస్తృత ప్రచారం అవసరమన్నారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, వకృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌వైపై ఆఫీసర్ టి గోపీనాథ్, అడబాల కరుణకుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణ సుధాకర్ పాల్గొన్నారు.

మున్సిపల్ చిరుద్యోగుల సమ్మె



సమ్మె శిబిరంలో నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ సిబ్బంది

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగం అవుట్ డోర్, ఇండోర్ సిబ్బంది 54 మంది తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి నిరసన బాట పట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేసి ఆందోళనకు దిగారు. తమ సమస్యలు, డిమాండ్లు పరిష్కారమయ్యే వరకూ సమె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. 15 సంవత్సరాలు పైబడిన సిబ్బందిని క్రమబద్ధీకరించాలి. టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.29,500, రూ.24,500 జీతం ఇవ్వాలి, 52 ఆదివారాలు, 17 దేశ, జాతీయ, రాష్ట్ర పండగల 72 రోజులను సెలవులుగానైనా ప్రకటించాలి లేదా వేతన దినాలుగానైనా ప్రకటించాలి, విధి నిర్వహణలో చనిపోయిన కార్మికునికి రూ.10 లక్షలు, అంగ వైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలి వంటి డిమాండ్లతో ఈ నిరసన చేపట్టారు.

బాగున్న రోడ్డును ధ్వంసం చేశారు

అమలాపురం రూరల్: అల్లవరం మండలం గోడిలంక గ్రామం రాజుగారి వీధిలో గల బాగున్న పంచాయతీ సిమ్మెంటు రోడ్డును ఈ నెల 4వ తేదీన గ్రామానికి చెందిన రుద్రరాజు సురేష్‌రాజు, వేగిరాజు శ్రీను, సర్పంచ్ రుద్రాజు లక్షిపతిరాజులు జేసీబీతో బలవంతంగా పగుల గొట్టి మట్టితో సహా ట్రాక్టర్ల మీద లోడ్ చేసి తీసుకువెళ్లారని అదే గ్రామానికి చెందిన రుద్రరాజు వెంకటరాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పగుల గొట్టిన రోడ్డు స్థానంలో మళ్లీ పక్కా రోడ్డు వేసేందుకు గ్రామానికి చెందిన అల్లూరి సత్యవతికి చెందిన ఖాళీ స్థలాన్ని ఆక్రమించి రుద్రరాజు సురేష్ రాజు ఇంటి వరకు వేయటానికి నిర్ణయించారని కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఎటువంటి పంచాయతీ తీర్మానం లేకుండా, రైతుల అంగీకారం తీసుకోకుండా రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై చర్య తీసుకొని రోడ్డు నిర్మాణాన్ని నిలిపి వేయాలని కోరారు.

మాస్టర్ ప్లాన్ పూర్తితో స్థల కేటాయింపు

యానాం: రీజెన్సీ యాజమాన్యానికి, కార్మికులకు మధ్య కుదిరిన ఒప్పందం మేరకు రీజెన్సీ సిరామిక్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్‌కు ఇవ్వాల్సిన స్థలంలో 25.4 ఎకరాలను యూనియన్ పేరుతో రిజిష్టర్ చేయడం జరిగిందని సోమవారం ఆ సంస్థ ప్రతినిధి మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఆ స్థలంలో ఒప్పందం మేరకు యూనియన్ కు కేటాయించిన స్థలంలో యాజమాన్యం బాధ్యత వహించి డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు, ప్రహరీ నిర్మాణం, కల్వర్టులు తదితర పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. కార్మికులకు కేటాయించిన స్థలాన్ని గృహ నిర్మాణాలకు అనువుగా ఏర్పాటు చేసి యూనియన్‌కు 6 నెలల క్రితమే అప్పగించడానికి సిద్ధం చేసినట్టు తెలిపారు. సంబంధిత స్థలాన్ని యానాం ఎమ్మెల్యే, రీజినల్ అడ్మినిస్ట్రేటర్, ఎస్పీ, సీఐ, లేబర్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పరిశీలించారన్నారు. 2022లోనే లే అవుట్ తయారు చేసి పుదుచ్చేరి ప్రభుత్వానికి పంపామని అయితే అప్పటికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం కాకపోవడంతో పెండింగ్‌లో ఉందన్నారు. మాస్టర్ ప్లాన్ సిద్ధమైన వెంటనే గెజిట్ నోటిఫికేషన్ ప్రచురణ తర్వాత యూనియన్ స్థలం అప్రూవల్ అవుతుందన్నారు.

చొల్లంగిలో యువకుడి అదృశ్యం



విప్పర్తి ఉత్తేజ్

తాళ్లరేవు: చొల్లంగి గ్రామానికి చెందిన విప్పర్తి ఉత్తేజ్ అనే యువకుడు అదృశ్యమైనట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. గండేపల్లి మండలం గండేపల్లి గ్రామానికి చెందిన ఉత్తేజ్, రవితేజ సోదరుల తండ్రి ఇటీవలే మృతి చెందారు. తల్లి కువైట్‌లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో చొల్లంగిలోని వారి పెద్దమ్మ కొంకి వెంకటలక్ష్మి ఇంట్లో ఉండి చదువుకుంటున్నారు. ఉత్తేజ్ కాకినాడ విద్యుత్ నగర్‌లోని ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గత నెల 30వ తేదీ ఉదయం 9.30 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి అప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. ఉత్తేజ్ కోసం బంధువుల ఇళ్ల వద్ద, చుట్టు పక్కల గ్రామాలలో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ మేరకు కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి యువకుడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నేడు పింఛన్ల వెరిఫికేషన్

అమలాపురం రూరల్: పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కాబడిన అల్లవరం మండలం గోడి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల వెరిఫికేషన్ కోసం 10 టీంలు ఏర్పాటు చేశారు. 403 మంది లబ్ధిదారుల పింఛన్ల వెరిఫికేషన్ కోసం ఇతర మండలాల నుంచి ఆయా ఈవోపీఆర్డీల నేతృత్వంలో 10 టీంలను ఎంపిక చేశారు. వీరందరికీ వెరిఫికేషన్‌లో యాప్‌లో ఏవిధంగా పింఛను వెరిఫికేషన్ చేయాలనే అంశంపై కలెక్టరేట్‌లో సోమవారం డీఆర్‌డీఏ పీడీ వి.శివ శంకరప్రసాద్, అమలాపురం, కొత్తపేట డీఎల్‌డీఓలు త్రినాథరావు, రాజేశ్వరరావులు అవగాహన కల్పించారు. అల్లవరం మండలం గోడి గ్రామంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి గృహాలను సందర్శించి పింఛన్ ఫీల్డ్ వెరిఫికేషన్ చేపట్టి సాయంత్రానికి పూర్తి చేయనున్నారు.

దివ్యాంగుల పట్ల శ్రద్ధ తీసుకోవాలి



బహుమతులు అందిస్తున్న డీవైఈవో సూర్యప్రకాశరావు

ఉప్పలగుప్తం: దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమాజంలో వారిని ఉన్నత స్థాయిలో నిలబడే విధంగా ప్రోత్సాహం అందించాలని ఎంపీడీవో పి.రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలోని భవిత సెంటర్లో సోమవారం జరిగిన దివ్యాంగుల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పిల్లలకు పలు రకాల పోటీలను నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు కె.కిరణ్ బాబు, ఎస్.సత్యకృష్ణ, హెచ్ఎంలు లంకరాణి, సత్యనారాయణ, ఐఈ ఆర్‌టీలు గంగాదేవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మండలంలోని బండారులంక భవిత కేంద్రంలో సోమవారం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీవైఈవో గుబ్బల సూర్య ప్రకాశరావు పాల్గొన్నారు. దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాల, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు రామలక్ష్మి, కామేశ్వరి, శ్రీనివాసరావు, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు వెసులుబాటు

యానాం: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం(పీఎంఎస్‌వై) ద్వారా అర్బన్ ఏరియాల్లో నివసిస్తున్న ఎస్సీలు గృహ నిర్మాణాలు చేసుకునేందుకు అవకాశం ఉందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా ప్రభుత్వం ద్వారా గృహాలు పొందని లబ్దిదారులు, పక్కా ఇళ్లు లేని వారు ఈ పథకానికి అర్హులన్నారు. వితంతువులు, ఒంటరి మహిళలు, సీనియర్ సిటిజన్స్, షెడ్యూల్డు కులాలు, తెగలు, మైనారిటీలు, ఇతర బలహీన వర్గాలకు చెందిన వారికి ఈ పథకంలో ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ఈ మేరకు వివిధ నిబంధనలతో కూడిన ప్రకటనను మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ శాఖ విడుదల చేసిందన్నారు.

మాజీ సీఎం రామచంద్రన్ మృతికి సంతాపం

యానాం: పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి ఎండీఆర్ రామచంద్రన్(90) అనారోగ్య కారణాలతో సోమవారం మృతి చెందారు. 1969లో నెట్టిపాకం నియోజకవర్గం నుంచి డీఎంకే అభ్యర్థిగా పోటీ చేసి అప్పటి ముఖ్యమంత్రి వెంకట సుబ్బారెడ్డియార్‌పై తొలిసారిగా విజయం సాధించారు. అనంతరం 1974, 1977ల్లో అన్నా డీఎంకే తరపున, 1980, 1985, 1990 ల్లో డీఎంకే తరపున, 2001లో మళ్లీ అన్నా డీఎంకే తరపున మనడిపట్టు నియోజకవర్గానికి పోటీ చేసి 7 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 1980 నుంచి 1983 మధ్య కాలంలో రెండు సార్లు పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2001 నుంచి 2006 వరకు పుదుచ్చేరి స్పీకర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ప్రభుత్వం తరపున మూడు రోజుల పాటు సంతాప దినాలు ప్రకటించడంతో ఆయన అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహిస్తామని సీఎం రంగసామి ప్రకటించారు. రామచంద్రన్ మృతికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఓ ప్రకటనలో సంతాపం వెలిబుచ్చారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



పశువుల్లంకలో మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ

ఐ.పోలవరం: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురు మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పరామర్శించారు. ఐ.పోలవరం మండలం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతి రాజు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయా గ్రామాల్లో పర్యటించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. పశువుల్లంక గ్రామంలో నేరేడిమిల్లి శ్రీరామమూర్తిని పరామర్శించి ఆయన తల్లి మృతికి సంతాపాన్ని వెలిబుచ్చారు. అదేవిధంగా మరికొంత మందిని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాశే రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు నేల కిశోర్, నాయకులు పెనుమత్స వాసురాజు, సుంకర నాగబాబు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.